అభివృద్ధి పనుల పరిశీలన



నాలా నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించిన కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: ఓల్డ్ మల్కాజిగిరి ఆంజనేయ స్వామి దేవాలయం (హనుమాన్ వ్యాయామ శాల) వద్ద ఓపెన్ నాలా స్థానంలో నూతన యూజీడీ పైపులైన్ పనులను కార్పొరేటర్ శ్రవణ్ శనివారం ప్రారంభించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గత 20 ఏళ్లుగా ఓపెన్ నాలా కారణంగా దోమల బెడద, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారన్నారు. సుమారు రూ.3.5 లక్షలతో యూజీడీ పనులు పూర్తి చేస్తామన్నారు. ఏఈ నవీన్, రమేష్, నాగరాజు, సునీల్‌యాదవ్, శోభన్ పాల్గొన్నారు.

నైట్ కాలేజీని తిరిగి ప్రారంభించాలి



ఎస్‌బీటీటీ సెక్రటరీకి వినతిపత్రం ఇస్తున్న ఈసీఐఎల్ ఉద్యోగులు

కుషాయిగూడ: నిలిపేసిన డిప్లొమా పార్ట్ టైమ్ నైట్ కాలేజీని తిరిగి ప్రారంభించాలని, ఈసీఐఎల్ ఎంప్లాయిస్ శనివారం తెలంగాణ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎస్‌బీటీటీ) సెక్రటరీ ఈఆర్ ఎ. పుల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. ఐటీఐ ఉద్యోగం చేసుకునే వారు గతంలో డిప్లొమా నైట్ కాలేజీలో చదువుకుంటూ డిప్లొమా చదువుకున్నారని, ప్రస్తుతం నైట్ కాలేజీ మూసివేయడంతో వారు చదువుకోలేకపోతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నైట్ కాలేజీలను పునరుద్ధరించాలన్నారు. సానుకూలంగా స్పందించిన సెక్రటరీ త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అజ్మీర్ వీరునాయక్, భూక్య ప్రవీణ్, హైదర్ అలీ, అంకిత్ ప్రసాద్ పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన స్థానిక నేతలు

కీసర: తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కను శనివారం బాలల హక్కుల కమిషన్ మెంబర్ గోగుల సరితావెంకటేష్, నాగారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు.

ఉగ్రవాదంపై ప్రజాగ్రహం

నిరసన ప్రదర్శన చేపట్టిన అన్ని వర్గాల ప్రజలు

మల్లాపూర్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి శాంతి చేకూరాలని మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయికిరణ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎలిఫెంట్ సర్కిల్ నుంచి శివహోటల్ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. డివిజన్ కో- ఆర్డినేటర్ ధన్‌పాల్‌రెడ్డి, ఉమేష్‌గౌడ్, సుదర్శన్, రాజుగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, బాలరాజ్, ముజీబ్, శ్రీనివాస్‌రెడ్డి, జోష్ తదితరులున్నారు.

- మల్లాపూర్ మే ఫ్లవర్ గ్రాండ్ అపార్ట్‌మెంట్‌లో పహల్గాం మృతులకు నివాళులర్పించి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఎం. ఆంజనేయులు, చంద్రశేఖర్,విజయ్‌కుమార్, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో..

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు క్యాండిల్ ర్యాలీని నిర్వహించారు. జెరుసలేం మత్తయ్య, సత్యం, పిలిప్స్, అగ్రిప్ప రాజు, బాబు తదితరులున్నారు.

- సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో జె. వెంకన్న, నాగరాజు, గౌస్, వెంకటేశ్వర్లు, ఉపేందర్, ఉర్మిళ తదితరులున్నారు.



మల్లాపూర్ మే ఫ్లవర్ అపార్ట్‌మెంట్‌లో..

పారిశ్రామికవేత్తల ర్యాలీ..

కుషాయిగూడ: ఉగ్రదాడిని నిరసిస్తూ శనివారం చర్లపల్లి పారిశ్రామికవాడకు చెందిన పారిశ్రామికవేత్తలు ర్యాలీ నిర్వహించారు. చర్లపల్లి ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా), ఫేజ్-2,3 సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పారిశ్రామికవేత్తలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. జయశంకర్ విగ్రహం చౌరస్తా నుంచి సురాన చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. ఐలా చైర్మన్ రోషిరెడ్డి, సెక్రటరీ వెంకటేశ్వర్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, రమేష్, ప్రసాద్, హనుమాన్ ప్రసాద్, వెంకటరామిరెడ్డి, కిశోర్, దినేశ్‌రెడ్డి, రఘు తదితరులున్నారు.

ఉగ్రమూకలను కఠినంగా శిక్షించాలి..

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి రాయంచ అవెన్యూ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. అధ్యక్షుడు నారాయణ, ముఖ్య కార్యదర్శి తునికి శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ వినోదయాదవ్, వైస్ ప్రెసిడెంట్ రాంబాబు, కాల నీవాసులు పాల్గొన్నారు.



మల్లాపూర్‌లో క్యాండిల్ ర్యాలీ



చర్లపల్లిలో పారిశ్రామికవేత్తల ర్యాలీ



పీర్జాదిగూడలో..



ఉప్పల్ చౌరస్తాలో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

అభివృద్ధి పనులు ప్రారంభం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి , కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: డివిజన్ పరిధిలో రూ.2.66 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. రూ.60 లక్షలతో బీటీ రోడ్డు, బీరప్పగడ్డ నుంచి మాణిక్‌చంద్ వరకు, రూ.35 లక్షలతో వెంకటరమణకాలనీలో సీసీరోడ్డు, రూ.30 లక్షలతో బ్రహ్మపురి కాలనీలో సీసీ రోడ్డు పనులు, రూ.45 లక్షలతో గుల్మోర్ గార్డెన్స్ బాక్స్‌డ్రైన్, రూ.45 లక్షలతో సింగం చెరువు తండా శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. డీఈ రూప, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామారావు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ గీత

రూ. 50 లక్షలతో అభివృద్ధి పనులు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో శనివారం నిర్వహించిన పలు అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ. 50 లక్షలతో పనులకు శంకుస్థాపన చేసినట్లు వివరించారు. సాయిరాంనగర్ కాలనీలో సీసీరోడ్డు, కుమ్మరి సంఘం శ్మశానవాటికను ప్రారంభించినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్‌లలో ప్రణాళికాబద్ధంగా, ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం రజతోత్సవ కార్యక్రమం సభకు రావాలని పలువురికి ఆహ్వాన పత్రాలను అందజేశారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

బోడుప్పల్: నేడు బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల సందర్భంగా వరంగల్ ఎలకతుర్తిలో జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేద్దామని బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డి పిలుపునిచ్చారు. బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీపై అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తిగా ఉన్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. బోడుప్పల్ మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, నేతలు కొత్త రవిగౌడ్, కుమార్, నాగేశ్వర్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్ తదితరులున్నారు.

గులాబీ శ్రేణులు రావాలి..

కుషాయిగూడ: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలకు గులాబీ శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. రజతోత్సవ వేడుకలను పురస్కరించుకుని బీఆర్ఎస్ మీర్‌పేట్-హెచ్‌బీ కాలనీ డివిజన్ మాజీ అధ్యక్షుడు వంజరి ప్రవీణ్ ఆధ్వర్యంలో శనివారం హెచ్‌బీకాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ గ్రౌండ్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలకు గులాబీ కుర్తాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి కుర్తాలను అందజేశారు. మాజీ కార్పొరేటర్లు గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, గొల్లూరి అంజయ్య, గుమ్మడి జంపాల్‌రెడ్డి, గంధం నాగేశ్వర్‌రావు తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంజీవ్‌రెడ్డి



కుర్తాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్

బీఆర్ఎస్ ఫ్లెక్సీల తొలగింపు



తొలగించిన ఫ్లెక్సీలు

మల్లాపూర్: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవసభకు సంబంధించిన ఫ్లెక్సీలను మల్లాపూర్, నాచారం డివిజన్‌లో ప్రధాన కూడళ్లలో బీఆర్ఎస్ నేతలు ఏర్పాటు చేశారు. శనివారం తెల్లవారు జామున డీఆర్ఎఫ్ సిబ్బంది వాటిని తొలగించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నేతలు ఫ్లెక్సీలను ఎలా తొలగిస్తారని వారితో వాగ్వాదానికి దిగారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో డీఆర్ఎఫ్ సిబ్బంది ఫ్లెక్సీలను తొలగిస్తున్నామన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జీర్ణించుకోలేక ఫ్లెక్సీలను తొలగిస్తున్నారని కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు.



ఎలిఫెంట్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 33/11 కేవీ నాచారం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ చందమామ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నాచారం పారిశ్రామికవాడలోని రోడ్ నెంబర్ 10, చందమామ ప్రెస్‌లైన్‌లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు నాచారం విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు. 11కేవీ ముత్తా మెటల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు ఐడీఏ నాచారం రోడ్డు నెంబర్ 09లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

అనుమతి లేకుండా వీడియో తీసిన వారిపై కేసు

మల్కాజిగిరి: ఇంట్లోకి ప్రవేశించడమే కాకుండా అనుమతి లేకుండా వీడియో తీసిన వ్యక్తులపై మల్కాజిగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. న్యూ మీర్జాలగూడకు చెందిన శ్రీరామ్‌యాదవ్ క్యాటరింగ్ వ్యాపారి. కాగా స్థానిక సమస్యలపై పోరాటం చేస్తుంటాడు. ఈనెల 25న ఆయన ఇంట్లో లేని సమయంలో ద్విచక్ర వాహనం మీద వచ్చిన ఇద్దరు వ్యక్తుల్లో వెనుక కూర్చున్న మహిళ ఆయన ఇంట్లోకి వెళ్లి వీడియో, ఫోటోలు తీసింది. శ్రీరామ్‌యాదవ్ భార్య విజయలక్ష్మి వారిని ప్రశ్నించడానికి ప్రయత్నించగా.. అక్కడ నుంచి పారిపోయారు. ఈ ఘటనపై శనివారం వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం



ఫీడర్‌ను ప్రారంభిస్తున్న డీఈ సుబ్బారావు

బోడుప్పల్: విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని హబ్సిగూడ డీఈ సుబ్బారావు అన్నారు. బోడుప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ సూర్యహిల్స్ ఫీడర్ పైన లోడ్ తగ్గించి, బాలాజీహిల్స్‌లో నూతన 11కేవీ ఫీడర్ ఏర్పాటు చేయగా.. ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేసవిలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం తలెత్తకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బోడుప్పల్‌లో నూతనంగా ప్రారంభించిన రెండు సబ్‌స్టేషన్ పనులను త్వరతిగతిన పూర్తి చేసేలా ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. డీఈ కేవీరెడ్డి, ఏడీఈలు రవీందర్, ప్రశాంత్, ఏఈలు వినయ్‌కుమార్‌రెడ్డి, వేణుగోపాల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు ఆస్తిపన్ను చెల్లింపునకు..

4 రోజులే గడువు

ఉప్పల్: ముందస్తు ఆస్తిపన్ను (ఎర్లీబర్డ్) చెల్లించడానికి ఇంకా 4 రోజులే గడువు మిగిలింది. ఆస్తిపన్నుపై 5 శాతం రాయితీని ప్రకటిస్తూ.. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఏప్రిల్‌లో ×ఎర్లీబర్డ్₹ ప్లాన్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. ముందస్తు ఆస్తిపన్ను రాయితీతో చెల్లించడానికి కేవలం 4 రోజులు మాత్రమే మిగిలి ఉంది. ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఉప్పల్ సర్కిల్, డీసీ ఆంజనేయులు, కాప్రా సర్కిల్ డీసీ జగన్‌లు కోరుతున్నారు. ఈ ఏడాది ఉప్పల్ సర్కిల్‌కు ఎర్లీబర్డ్‌కు రూ.16 కోట్లు టార్గెట్‌ను జీహెచ్‌ఎంసీ విధించింది. ఇప్పటికే దాదాపుగా రూ. 14 కోట్ల వరకు వసూలు చేసినట్లు డీసీ ఆంజనేయులు ప్రకటించారు. గతేడాది ఎర్లీ బర్డ్‌లో రూ. 16 కోట్లు టార్గెట్ ఉండగా.. టార్గెట్ పూర్తి చేశామన్నారు. ఇక మిగిలిన 4 రోజుల వ్యవధిని ఆస్తిపన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అగ్నిప్రమాదం



మల్లాపూర్: నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాన్సన్ గ్రామర్ హైస్కూల్ సమీపంలోని ఖాళీ స్థలంలో చెత్తకు నిప్పంటుకుంది. దీంతో చెత్తకు మంటలు అంటుకోవడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. దట్టమైన పొగరావడంతో సమీపంలోని దుర్గానగర్ కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. ఫైర్ ఆఫీసర్ గణేష్ ఆధ్వర్యంలో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం !

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. ప్రధాన రోడ్డు, అంతర్గత రోడ్ల పక్కన ప్రతిరోజు చెత్త,చెదారం రోజుల తరబడి పేరుకుపోవడంతో స్థానిక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను తరలించే వాహనం సక్రమంగా రాకపోవడంతో చెత్తాచెదారం నిల్వ ఉండి దుర్వాసన వ్యాపిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు దోమలు, ఈగలు వృద్ధి చెందడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గౌతంనగర్ డివిజన్‌లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



గౌతంనగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్త,చెదారం

జర్నలిస్టుల సంక్షేమం టీయూడబ్ల్యూజేతోనే సాధ్యం



సమావేశంలో పాల్గొన్న జర్నలిస్టులు

మల్కాజిగిరి: జర్నలిస్టుల సంక్షేమం టీయూడబ్ల్యూజేతోనే సాధ్యమవుతుందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ అన్నారు. శనివారం మల్కాజిగిరి పద్మావతి ఫంక్షన్‌హాల్‌లో టీయూడబ్ల్యూజే-ఐజేయూ జిల్లా అధ్యక్షుడు బాలరాజు అధ్యక్షతన నియోజకవర్గ జర్నలిస్టుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. గత ఆరు దశాబ్దాలుగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి యూనియన్ కృషి చేస్తున్నందున జర్నలిస్టులు విశ్వసిస్తున్నారన్నారు. ఏ పార్టీ, ప్రభుత్వానికి వత్తాసుపలకలేదని, గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటం చేస్తున్నామన్నారు. యూనియన్ కోశాధికారి మోతె వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్రామ్‌రెడ్డి, కోశాధికారి బిక్షపతి, సహాయ కార్యదర్శి వెంకటేష్, మల్కాజిగిరి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బాలరాజు, కార్యదర్శి విశాల్‌యాదవ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

అలరించిన భరతనాట్య ప్రదర్శన



ఉప్పల్ మినీ శిల్పారామంలో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శ్రీ అంజన నాట్యాలయ గురువు సాయిశ్రీ శిష్య బృందంచే నిర్వహించిన భరతనాట్య నృత్య ప్రదర్శన అలరించింది. నాట్య సుధ, పుష్పాంజలి, విష్ణుస్తుతి, చక్కని తల్లికి, ముద్దుగారే యశోద, పలుకే బంగారమాయేనా తదితర అంశాలను కళాకారులు అదితి, జాహ్నవి, సుదీక్ష, వర్షిణి, మాన్యశ్రీ, అక్షర, భావన, రిషిక, అనన్య తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో సీసీరోడ్లు వేయాలని కోరుతూ కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ శనివారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని ప్రియదర్శిని ఎన్‌క్లేవ్, రాయల్ ఎన్‌క్లేవ్, శివం బావి, రుక్మిణి ఎన్‌క్లేవ్, సెయింట్ పాయిస్ స్కూల్ వద్ద సీసీరోడ్లు వేయాలని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు. కాలనీ వాసులు రాంచందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు బొబ్బిలి సురేందర్ రెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్

ఇంటర్మీడియట్‌లో అల్ఫోర్స్ కళాశాల ఉత్తమ ఫలితాలు



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ నరేందర్‌రెడ్డి

అల్వాల్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన అల్వాల్ అల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థుల అభినందన సభను కళాశాలలో నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎప్పుడు లేని విధంగా అల్వాల్ అల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. సీనియర్ ఎంపీసీలో హస్త 992, సిరిచందన 988, ఎం .సాయి భవ్యశ్రీ 987, బైపీసీలో వర్షిత 972 మార్కులు సాధించారని, జూనియర్ ఎంపీసీలో లక్ష్మీప్రియ 468, హాసిని 467, లక్ష్మీ అధిత, మహిత, రక్షిత్, భరద్వాజ్‌లు 466 మార్కులు, వైష్ణవి, సాయి హనుమాన్‌లు 465, ప్రీతి, యశస్విని, శివరామరాజు, ప్రణీత్‌రెడ్డిలు 464 మార్కులు, బైపీసీలో సత్య బ్రాహ్మణి 438, తెజాస్వీ 436, అనుపమ 434 మార్కులు సాధించారన్నారు. అనంతరం విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే

మల్లాపూర్: మల్లాపూర్ అంగన్‌వాడీ సెక్టార్ ఆధ్వర్యంలో చిన్నారులకు శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు నాగరాణి, వాని, స్వరూప, హిమబిందు, దేవకరుణ, అయాలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో చిన్నారులు